క్లుప్తంగా

రైతుబజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 75, వంకాయ 28, బెండ 45, పచ్చిమిర్చి 85, కాకర 45, బీర 35, క్యాబేజి 14, ఫ్రెంచి బీన్స్ 95, క్యారెట్ 47, దొండ 19–28, చిక్కుడు 55–65, గోకర 28, బీట్‌రూట్ 27, క్యాప్సికం 75, ఆలు 21, దోస 18, సార 13, పొట్ల 15, ఉల్లిగడ్డ 19, చామగడ్డ 40. శుక్రవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, పలు మరమ్మతు పనుల కారణంగా శుక్రవారం ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని కింది ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈ హన్మంత్‌రావు తెలిపారు.

- ఉదయం 8 నుంచి 11 గంటల వరకు...
ఏబీ కాలనీ, వాటర్ పంప్, మిడాస్ హాస్పిటల్, గంగా టవర్, సాయిబాబా టెంపుల్, రైల్వే రిజర్వేషన్ కౌంటర్, పుల్లారెడ్డి స్వీట్స్ పరిసర ప్రాంతాలు.
- ఉ.11 నుంచి మ.ఒంటి గంట వరకు ...
వెంకటాద్రి నగర్, ఎస్‌బీహెచ్, ఆస్మాన్‌ఘడ్, భూలక్ష్మీనగర్ పరిసర ప్రాంతాలు.
- మ.3 నుంచి సా. 5 గంటల వరకు...
లక్ష్మీనగర్ క్రాస్ రోడ్, రామాలయం, వాణీనగర్, పటేలమ్మ మడిగ, ఆనంద్ బిస్కట్ ఫ్యాక్టరీ, ధోబీఘాట్ రోడ్ పరిసర ప్రాంతాలు.

చదువుల్లో రాణించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలి


సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తున్న విద్యార్థులు

దిల్‌సుఖ్‌నగర్: విద్యార్థులు చదువుల్లో రాణించి జీవితంలో గొప్పస్థాయికి చేరుకోవాలని భాష్యం పాఠశాల ఎల్‌బీనగర్ జోన్ ఇన్‌చార్జ్ అంకమ్మరావు అన్నారు. ఆర్‌కే పురం భాష్యం హైస్కూల్ విద్యార్థుల ఫ్రెషర్స్‌డే వేడుకలు గురువారం పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎన్నికలు నిర్వహించారు. ఎస్‌పీఎల్‌గా 9 వ తరగతి విద్యార్థి ఎం.రిషికేష్, డిప్యూటీ ఎస్‌పీఎల్‌గా 8వ తరగతి విద్యార్థి అక్షరారెడ్డి, ఏవియేటర్స్ హౌస్ లీడర్‌గా కీర్తన్ కవిష్, మెరైన్స్ హౌస్ లీడర్‌గా సాయి రిత్విక్, ట్రాకర్స్ హౌస్ లీడర్‌గా కార్తీక్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో భాష్యం లిటిల్ ఛాంప్స్ హెచ్‌ఎం అనుపమ తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో పండ్ల పంపిణీ

సైదాబాద్: ప్రజాసమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని సేవాలాల్ బంజారా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కొర్ర మోతీలాల్ నాయక్ అన్నారు. గురువారం ఆయన పుట్టిన రోజు సందర్భంగా సంఘం నాయకులతో కలిసి ఐఎస్‌సదన్ డివిజన్ వినయ్‌నగర్ కాలనీలోని జీఎస్‌ఆర్ ఆసుపత్రిలో చిన్నారులకు, రోగులకు, సిబ్బందికి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు దేవానాయక్, సక్రిబాయి, గణేష్‌నాయక్, జుక్కీబాయి శాంతిబాయి పాల్గొన్నారు.

ముక్తిఘాట్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవాలి


ముక్తిఘాట్‌ను సందర్శించిన కార్పొరేటర్ నర్సింహారెడ్డి తదితరులు

నాగోలు: ఫతుల్లాగూడలో ఏర్పాటు చేసిన ముక్తిఘాట్‌ను గురువారం మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, నాగోలు కార్పొరేటర్ చింతల అరుణాసురేంద్రనాథ్ యాదవ్ సందర్శించారు. అక్కడ జరుగుతున్న పనులను వారు పరిశీలించారు. ముక్తిఘాట్ పూర్తిస్థాయిలో అందుబాటులో లేదన్నారు. పనులు పూర్తి కాకుండానే అధికారులు హడావుడిగా ప్రారంభించారన్నారు. ఇప్పటికైనా అధికారులు ముక్తిఘాట్‌ను పూర్తి స్థాయిలో అందుబాటులో తీసుకొని రావాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు దప్పు రాజు, రావుల శ్రీనివాస్‌గౌడ్ ప్రభాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

రోడ్లపై సర్కస్ ఫీట్లు చేస్తే జైలుకే..

వనస్థలిపురం సీఐ హెచ్చరిక


రోడ్లపై త్రిబుల్ రైడింగ్ చేస్తూ పోలీసులకు పట్టుబడ్డ మైనర్లు

హస్తినాపురం: యువకులు రోడ్లపై సర్కస్ ఫీట్లు చేస్తూ అజాగ్రత్తగా ద్విచక్రవాహనాలను నడిపితే కేసు నమోదు చేసి జైలుకు పంపిస్తామని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ దేప జలేంధర్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం వనస్థలిపురం పరిధిలో సాయంత్రం ముగ్గురు బాలురు ఇతరులకు ఇబ్బంది కలిగేలా వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డారు. ఈ సందర్భంగా సీఐ జలేంధర్‌రెడ్డి మాట్లాడుతూ, యువకులు ద్విచక్ర వాహనాలపై రాష్ డ్రైవింగ్, సింగిల్ వీల్, జిగ్‌జాగ్ డ్రైవింగ్, అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లను వినియోగించడం, త్రిబుల్ డ్రైవింగ్, వాహనాలను నడుపుతూ ఒక్కసారిగా కటింగ్ కొట్టి తోటి వాహనదారులకు, ప్రజలకు ఇబ్బంది కలిగించడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలను నడపటం వంటివి చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఇందులో భాగంగానే ద్విచక్రవాహనాలను అజాగ్రత్తగా నడుపుతూ పట్టుబడ్డ ముగ్గురు మైనర్లపై కేసు నమోదు చేశామన్నారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న విషయాన్ని దృష్టిలో పెట్టుకొని తల్లిదండ్రులు మైనర్లుకు వాహనాలను ఇవ్వొద్దని సీఐ జలేంధర్‌రెడ్డి సూచించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై చట్టరీత్యా చర్యలు తప్పవని సీఐ జలేంధర్‌రెడ్డి హెచ్చరించారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



దిల్‌సుఖ్‌నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న రవీంద్రభారతి స్కూల్ విద్యార్థులు

మలక్‌పేట: భవిష్యత్ తరాల శ్రేయస్సు కోసం పర్యావరణం కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని దిల్‌సుఖ్‌నగర్ రవీంద్రభారతి జోనల్ డీన్ జ్యోతి అన్నారు. నేషనల్ పేపర్ బ్యాగ్ డే సందర్భంగా గురువారం 'సే నో టూ ప్లాస్టిక్- యూజ్ పేపర్ బ్యాగ్స్' అనే నినాదంతో పాఠశాల విద్యార్థులు చేపట్టిన ర్యాలీని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణానికి కలిగే నష్టాన్ని ప్రజలకు వివరించి చైతన్య పర్చాలన్నారు. ప్లాస్టిక్ వాడకానికి దూరంగా ఉండాలన్నారు. ర్యాలీ పాఠశాల నుంచి ప్రారంభమై వెంకటాద్రిగల్లీ, ఆర్‌ఎస్ బ్రదర్ మీదుగా కొనసాగింది. కార్యక్రమంలో డీఐ దయాకర్, ఏడీఐ నిషాంత్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాలనీల్లో సదుపాయాలు కల్పిస్తాం


సైదాబాద్ కాలనీలో పాదయాత్ర చేస్తున్న కార్పొరేటర్ అరుణారవీందర్‌రెడ్డి

సైదాబాద్: డివిజన్ పరిధిలోని కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తామని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి అన్నారు. గురువారం కార్పొరేటర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి సైదాబాద్ కాలనీలో పాదయాత్ర చేసి స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిశీలించారు. కాలనీలోని పలు అంతర్గత రహదారులు దెబ్బతిన్నాయని, పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపరచాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కార్పొరేటర్‌ను కోరారు. స్పందించిన ఆమె వెంటనే సంబంధిత అధికారులతో చర్చించి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బసవేశ్వర్, ఉదయ్, సురేష్, లక్ష్మి, స్వామి పాల్గొన్నారు.

రజకుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా: ఉప్పల


గాడ్గే రజక సంఘం కార్యాలయాన్ని ప్రారంభించిన శ్రీనివాస్‌గుప్తా, బ్రహ్మయ్య

సైదాబాద్: రజకుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా తెలిపారు. గురువారం ఆయన సంఘం అధ్యక్షుడు పెద్దపూర బ్రహ్మయ్యతో కలిసి సైదాబాద్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ గాడ్గే రజక సంఘం కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రజకులు ఐక్యంగా సాగి హక్కులు సాధించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి వి.మడేల్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ పున్నం రాములు, పగిళ్ల వెంకట్, తిరుపతి, జగన్, లక్ష్మణ్, రాందాస్, వెంకటేష్, యాదగిరి, సాయి పాల్గొన్నారు.

భూమిని స్వాధీనం చేసుకున్న గ్రేటర్ అధికారులు


భూమిని స్వాధీనం చేసుకుంటున్న గ్రేటర్ అధికారులు

హయత్‌నగర్: అన్మగల్ హయత్‌నగర్‌లో గతంలో జీహెచ్‌ఎంసీకి రెవెన్యూ శాఖ కేటాయించిన భూమిని గురువారం గ్రేటర్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సర్వే నెంబర్ 191లో సుమారు ఎకరం 9 గంటల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమి కబ్జాకు గురికాగ రెవెన్యూ అధికారులు కబ్జా నుంచి విడిపించి చుట్టూ ఫెన్సింగ్ వేశారు. కొంత కాలం తర్వాత ఈ భూమిని జీహెచ్‌ఎంసీకి కేటాయించారు. మళ్లీ ఈ భూమి కబ్జా అవుతుండటంతో గురువారం డీఈఈ దామోదర్‌రావు, టీపీఓ ఉమ తమ సిబ్బందితో వచ్చి స్వాధీనం చేసుకొని చుట్టూ ఫిన్సింగ్ వేశారు. ఈ సందర్భంగా కొందరు అక్కడ తమ ప్లాట్లు ఉన్నాయంటూ ఫెన్సింగ్ పనులను అడ్డుకోబోగా అధికారులు సర్ది చెప్పి వారిని పంపించి వేశారు.

ఆలయాల వద్ద అభివృద్ధి పనుల పరిశీలన


అమ్మవారి గుడి వద్ద జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

మలక్‌పేట: బోనాల సందర్భంగా ఆలయాల వద్ద భక్తులకు ఇబ్బందులు కలుగకుండా వసతులు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ మధుసూదన్‌రెడ్డి తెలిపారు గురువారం డివిజన్ పరిధిలోని పెద్దబజార్, వడ్డెర సంఘం, సంజీవయ్యనగర్, శాలివాహననగర్ వాంబేకాలనీల్లోని అమ్మవారి గుళ్ల వద్ద బోనాల సందర్భంగా జరుగుతున్న ఏర్పాట్లు, అభివృద్ధి పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఆలయాల పరిసరాల్లో రోడ్ల మరమ్మతులు, లైటింగ్, టైల్స్, ఫ్లోరింగ్ పనులు జరుగుతున్నాయన్నారు. సకాలంలో పనులు పూర్తి చేయాలని అధికారులను కార్పొరేటర్ కోరారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ రవికాంత్, సైట్ ఇంజినీర్ ఏడుకొండలు, సత్తిరెడ్డి, నాయకులు గణేష్, ఉదయ్, దినేష్, మల్లేష్, సంతోష్ తదితరులు ఉన్నారు.

సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి


దీక్ష కళాశాల విద్యార్థులతో సీడీటీఐ అధికారులు

లింగోజిగూడ: సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా విదార్థులు అప్రమత్తంగా ఉండాలని సెంట్రల్ డిటెక్టివ్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ (సీడీటీఐ) ప్రిన్సిపాల్ జయకుమార్, విశ్రాంత పోలీస్ అధికారి వేణుగోపాల్ తెలిపారు. ఎల్‌బీనగర్‌లోని దీక్ష కళశాల విద్యార్థులు రామంతాపూర్‌లో హోం మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సెంట్రల్ డిటెక్టివ్ ట్రైనింగ్ (సీడీటీఐ)ను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలు, నేరాలు జరిగినప్పుడు క్లూస్ సేకరణ వంటి అంశాలపై విద్యార్థులకు సీడీటీఐ అధికారులు అవగాహన కలిగించారు. డిటెక్టివ్ ఉద్యోగాలపై యువత ఆశక్తి చూపించాలని వారు సూచించారు. కార్యక్రమంలో ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ క్రాంతి కుమార్, దీక్ష కళాశాల నిర్వాహకులు క్రాంతి, రాజు, శంకర్, సాయి, అశ్విన్ పాల్గొన్నారు.

బోనాల మహోత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు

సైదాబాద్: బోనాల ఉత్సవాలకు యాకుత్‌పురా నియోజకవర్గ పరిధిలోని అమ్మవారి ఆలయాల వద్ద ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నామని నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ సామ సుందర్‌రెడ్డి అన్నారు. గురువారం ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని దామోదరం సంజీవయ్యనగర్‌లోని నల్లపోచమ్మ ఆలయం ప్రతినిధులకు బోనాల వేడుకల నిర్వహణకు ప్రభుత్వం మంజూరు చేసిన నిధుల చెక్కును ఆయన అందజేశారు. ఈ సందర్భంగా సుందర్‌రెడ్డి మాట్లాడుతూ, బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్నివర్గాల పండుగలకు సముచిత ప్రాధాన్యం ఇస్తుందన్నారు. బోనాల ఉత్సవాలకు అమ్మవారి ఆలయాలను సుందరంగా అలంకరించాలని, ఆలయాలకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆలయ కమిటీ ప్రతినిధులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మెట్టు భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యంతో ప్రజలకు అగచాట్లు

- సామ రంగారెడ్డి.


ఎల్‌బీనగర్: ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ వైఫల్యం చెందడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, బీఎన్‌రెడ్డి నగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఆరోపించారు. ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో భాగంగా గురువారం వారు బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లోని మెడికల్ అండ్ హెల్త్ కాలనీ, గాంధీనగర్ కాలనీలలో పాదయాత్ర చేసి కేంద్ర పథకాలను స్థానికులకు వివరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, స్థానిక ఎమ్మెల్యేకు కబ్జాలపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో లేదన్నారు.శివారు కాలనీల్లో మౌలిక సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సీడీఎఫ్ నిధులు ఇప్పటి వరకు ఎంత ఖర్చు చేశారో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య తెలంగాణ కోసం బీఆర్‌ఎస్‌ను ఓడించి బీజేపీని గెలిపించాలని కోరారు.

ఆర్థిక సాయం అందజేత


ఆర్థిక సాయం చెక్కును అందజేస్తున్న కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ నేతలు

మన్సూరాబాద్: చైతన్యపురిలో శివ మెడికల్ స్టోర్ నిర్వహిస్తున్న కూరెళ్ల రమేష్ అకాల మరణం చెందడంతో అతడి కుటుంబాన్ని ఆదుకునేందుకు రంగారెడ్డి జిల్లా కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ ముందుకు వచ్చింది. అసోసియేషన్ అధ్యక్షుడు పెండెం కృష్ణకుమార్ ఆధ్వర్యంలో వివిధ మెడికల్ షాప్ యజమానులు అందజేసిన రూ.52,617 వేల చెక్కును రమేష్ సతీమణి అండాళ్‌కు గురువారం అందజేశారు. కార్యక్రమంలో కృష్ణకుమార్ మాట్లాడుతూ, సకాలంలో సహృదయంతో స్పందించిన మెడికల్ షాప్ యజమానులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి సత్యనారాయణ, యాదగిరి, శివ, కోడి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ బీఎన్‌రెడ్డి నగర్ అధ్యక్షుడిగా మహ్మద్ సిరాజ్



ఎల్‌బీనగర్: బీఎస్పీ బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ అధ్యక్షుడిగా మహ్మద్ సిరాజ్, ఉపాధ్యక్షుడిగా వర్కుల మహేందర్‌ను నియమించారు. ఈ మేరకు బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు గువ్వల సాయిరామకృష్ణ ఉత్తర్వులు జారీ చేసి నియామక పత్రాలను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా సిరాజ్, మహేందర్‌లు మాట్లాడుతూ, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ఆదేశానుసారం పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. తమ నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వేముగంటి సంపత్, నాయకులు శశి, మహ్మద్ బాసిత్, నయీమ్, రహీం, నాగరాజు, రాము పాల్గొన్నారు.

వరద కాలువ పనులు వేగంగా పూర్తి చేయండి

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


వరద కాలువ పనులపై సమీక్షిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: వరద కాలువ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తిచేయాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన తన క్యాంప్ కార్యాలయంలో ఎస్‌ఎన్‌డీపీ డీఈ పవన్ వరద కాలువ పనులపై సమీక్ష ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సాహెబ్‌నగర్‌లోని గాయత్రీనగర్ ఫేజ్–4 నుంచి క్రిస్టల్‌విల్లా వరకు.. సుమారు రూ.2 కోట్ల వ్యయంతో వరద కాలువ పనులు పూర్తి చేశామన్నారు. క్రిస్టల్‌విల్లా నుంచి దిగువ ప్రాంతంలోని మహాలక్ష్మీనగర్‌వరకు సుమారు రూ.1.5కోట్లతో వరద కాలువ పనులకు నిధులు మంజూరు చేశామన్నారు. యుద్ధప్రాతిపదికన స్టామ్ వాటర్ డ్రెయిన్ పనులను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలం దృష్ట్యా పనులను వేగంవంతం చేయాలన్నారు. సకాలంలో వరద కాలువ పనులు పూర్తయితే పూర్తిస్థాయిలో వరద ముంపు నుంచి విముక్తి కల్గుతుందన్నారు. నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారిస్తామని ఎమ్మెల్యే స్పష్టంచేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులు


ఖాద్రీ కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో రోజురోజుకూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. గురువారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని ఖాద్రీకాలనీలో కాలనీవాసులతో కలిసి కార్పొరేటర్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కాలనీలో నెలకొన్న సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు కృషి చేస్తానని, సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేసేందుకు త్వరలోనే అధికారులతో ప్రతిపాదనలు సిద్ధం చేయిస్తానని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు జమీర్, సయ్యద్ అబ్బాస్, ఖయ్యూం, నిజాం, రషీద్, జాఫ్రీ, మమత, మల్లేశ్‌గౌడ్, గోపీరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎక్సెల్ కాలేజీలో ఘనంగా బోనాలు



బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న పాటిమీది జగన్‌మోహన్ రావు, తదితరులు

ఎల్‌బీనగర్ శ్రీశంకర్ కాలనీలోని ఎక్సెల్ కాలేజీ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ లో గురువారం బోనాల ఉత్సవాలు నిర్వహించారు. కళాశాల చైర్మన్ దుగుంట్ల నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర టెక్నికల్ సర్వీసెస్, ఖనిజాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పాటిమీది జగన్‌మోహన్ రావు హాజరయ్యారు. మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్న, రంగేశ్వరి, ప్రమీల, శైలజ, శ్వేతారెడ్డి, తూర్పాటి చిరంజీవి, గొల్ల సతీష్‌యాదవ్, విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు. – నాగోలు

నేడు పోచమ్మదేవికి పట్టువస్త్రాల సమర్పణ

మన్సూరాబాద్: బోనాల సందర్భంగా శ్రీదుర్గాదేవి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం 5 గంటలకు పోచమ్మ దేవికి పట్టువస్త్రాలు సమర్పిస్తామని దుర్గాదేవి ఆలయ కమిటీ చైర్మన్ పోచబోయిన గణేష్‌యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా దుర్గాదేవి ఆలయం నుంచి ఫలహార బండి ఊరేగింపు నిర్వహిస్తామన్నారు.

మోహిని వంశ @ చేకూరి మోహిని, D/o చేకూరి నాగార్జున చౌదరి, వయస్సు : 36, H.No 8-4-21/4 పావనిపురంకాలనీ, చంపాపేట, జిల్లా: రంగారెడ్డి, పిన్ : 500079, తెలంగాణ స్టేట్. నాయొక్క పాస్‌పోర్టు నంబరు K9435047 మరియు టెన్త్, ఇంటర్ సర్టిఫికెట్లు జీవన్ హాస్పిటల్ నుంచి చంపాపేటకు వెళ్లే మార్గమధ్యలో పడిపోయినవి. కావున దొరికిన వారు సంప్రదించగలరు. సెల్: 80749 31537.

కేన్సర్ ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు హర్షణీయం

రాజ్యసభ సభ్యుడు అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్


కేన్సర్ స్క్రీనింగ్ పరీక్ష విధానాన్ని పరిశీలిస్తున్న ఎంపీ లక్ష్మణ్‌తో మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: ఎలాంటి రాజకీయ లబ్ధి ఆశించకుండా కేవలం సేవాభావంతో పేద మహిళ కోసం కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ వైద్య పరీక్ష శిబిరం ఏర్పాటు చేయడం హర్షణీయమని రాజ్యసభ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు. గురువారం మధుసూదన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా కర్మన్‌ఘాట్ గాంధీ విగ్రహ చౌరస్తాలో ఏర్పాటు చేసిన వైద్య పరీక్ష శిబిరాన్ని లక్ష్మణ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ... కరోనా కష్టకాలంలో బీజేపీ సంఘ్ పరివార్ సభ్యులు కోవిడ్ బాధితులకు అండగా నిలబడి పలు సేవా కార్యక్రమాలు చేపట్టారని గుర్తు చేశారు. మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ, మొబైల్ వాహనంలో ఐదు కోట్ల రూపాయలు విలువైన అత్యాధునిక వైద్య పరీక్ష సామగ్రితో వైద్యనిపుణులచే 152 మంది మహిళలకు, ఒక్కొకరికీ రూ. 10 వేల విలువైన కేన్సర్ స్క్రీనింగ్ వైద్య పరీక్షలు చేయించామన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అర్బన్ బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కార్పొరేటర్లు నర్సింహారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, లచ్చిరెడ్డి, పవన్‌కుమార్, ప్రేమ్ మహేశ్వరరెడ్డి, డివిజన్ పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి, నాయకులు సందీప్‌రెడ్డి, రమేష్‌గౌడ్, దశరథగౌడ్ పాల్గొన్నారు.

క్యాష్ బ్యాగ్‌లోని నగదు చోరీ

హయత్‌నగర్: మతిస్థిమితం సరిగ్గా లేని వ్యక్తి పెట్రోల్ బంక్ క్యాష్ బ్యాగ్ నుంచి నగదును చోరీ చేశాడు. బంక్ యాజమాన్యం ఫిర్యాదుతో నిందితుడి కుటుంబ సభ్యులు నగదును తిరిగి ఇచ్చేసిన ఘటన గురువారం హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విశ్వసనీయ సమాచారం మేరకు కుంట్లూర్ రోడ్డులోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌లో రెండు రోజుల క్రితం ఓ మతిస్థిమితం లేని వ్యక్తి వెళ్లి సిబ్బంది క్యాష్‌బ్యాగ్ నుంచి కొంత నగదు అపహరించాడు. పెట్రోల్ బంక్ సిబ్బంది ఫిర్యాదు మేరు పోలీసులు కేసు నమోదు చేశారు. విషయం తెలుసుకున్న నిందితుడి కుటుంబ సభ్యులు నగదును తిరిగి బంక్ యజమానికి ఇచ్చేశారు.

భార్యను కొట్టిన భర్తకు జైలుశిక్ష

చాదర్‌ఘాట్: భార్యను దుర్భాషలాడి, గాయపర్చిన భర్తకు న్యాయస్థానం జైలుశిక్ష విధించింది. చాదర్‌ఘాట్ సీఐ ప్రకాష్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... ఓల్డ్‌మలక్‌పేటకు చెందిన మహ్మద్ హాజీఅలీ (30) తన భార్య ఫాతీమాను నిత్యం కొడుతూ దుర్భాషలాడేవాడు. దాంతో విసిగిపోయిన ఆమె చాదర్‌ఘాట్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు హాజీఅలీని నాంపల్లి 6వ స్పెషల్ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి లక్ష్మణరావు అతనికి ఐదు రోజుల శిక్ష విధించారు.

ఆటోడ్రైవర్ అదృశ్యం

సైదాబాద్: ఆటో డ్రైవర్ కనిపించకుండా పోయిన ఘటన సైదాబాద్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... సింగరేణి కాలనీలో నివసించే ఆర్.లచ్చు (40) ఈనెల 3వ రోజూ మాదిరిగానే ఆటో నడిపేందుకు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఒక్కోసారి ఇలా ఇంటి నుంచి వెళ్లి రెండు, మూడ్రోజులకు తిరిగి వచ్చేవాడు. 6వ తేదీ నాటికి కూడా అతను తిరిగి రాలేదు. భార్య రమావత్ జ్యోతి ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించడం లేదు.

దీంతో ఆమె లచ్చు కోసం స్నేహితులు, బంధువుల ఇళ్ల వద్ద వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో బుధవారం సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9666021515
9505507616
9912220363
9912220365